క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తలకొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తలకొండపల్లి, చుక్కాపూర్, వెల్జాల్, గట్టుఇప్పలపల్లి, పడకల్ గ్రామాల్లో పీఏసీఎస్ సీఈఓ ప్రతాప్‌రెడ్డి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏ–గ్రేడ్ వరికి రూ.2203, బి–గ్రేడ్ ధాన్యానికి 2,183 మద్దతు ధర ఉంటుందన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించకుండా.. నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను తీసుకోవాలన్నారు. పీఏసీఎస్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం

కడ్తాల్: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే డెలివరీ అయ్యింది. వివరాలు.. మండల పరిధిలోని మక్తమాదారం గ్రామానికి చెందిన బ్యాగరి వినోద నిండు గర్భిణి. సోమవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. మక్తమాదారం గ్రామానికి చేరుకున్న అంబులెన్స్ గర్భిణిని తలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో పురిటినొప్పులు తీవ్రం కావడంతో.. అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలిపిన సిబ్బంది అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వైద్యసేవల నిమిత్తం తల్లీబిడ్డను తలకొండపల్లి ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. అంబులెన్స్ సిబ్బంది, ఈఎంటీ కుమార్, పైలట్ శ్రీనివాస్‌కు.. వినోద కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదం కేసులో..

నిందితుడికి రెండేళ్ల జైలు

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ద్విచక్ర వాహనదారుడికి ఎల్‌బీనగర్‌లోని సెషన్స్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించిందని ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కోనాపూర్ గేటు సమీపంలోని మిషన్ భగీరథ రిజర్వాయర్ ఎదుట 2021 ఏడాదిలో ఒకరోజున కడ్తాల మండలం నెర్లెకోడు తండాకు చెందిన కేతావత్ పిక్కు ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా నడిపాడు. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న ఆమనగల్లుకు చెందిన తోట రాములును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ వేశారు. రెండేళ్ల సుదీర్ఘ వాదనల అనంతరం సెషన్స్ కోర్టు న్యాయమూర్తి.. నిందితుడు కేతావత్ పిక్కుకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6,500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ బల్‌రాం తెలిపారు.

మైనర్‌పై అత్యాచారం కేసులో..

నిందితుడికి 20 ఏళ్ల జైలు

యాచారం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తికి ఎల్బీనగర్ జిల్లా కోర్టు మంగళవారం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. యాచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నల్లవెల్లి తండాకు చెందిన రమావత్ చందర్(23) 2017లో అదే తండాకు చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు సరైన ఆధారాలతో కోర్టుకు నివేదిక అందజేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపిన కోర్టు.. చందర్‌కు 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధించింది. బాలిక కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి న్యాయస్థానం సూచించినట్లు సీఐ సైదయ్య తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

ఒకరి దుర్మరణం

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. యాచారం సీఐ సైదయ్య తెలిపిన వివరాలు.. నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రానికి చెందిన భవానీ ప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా వనపల్లికి చెందిన కదాసు ప్రసాద్(30)తో కలిసి బైక్‌పై మంగళవారం హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో తక్కళ్లపల్లి గేట్–మాల్ మధ్యన బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్ర గాయాలైన భవానీప్రసాద్‌ను 108లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన నేతలు




తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. జై కేసీఆర్, జై మంచిరెడ్డి అంటూ నినాదాలు చేశారు.డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు విజయానందరెడ్డి, కార్తీక్, కృష్ణ, యాదిరెడ్డి తదితరులు ఉన్నారు.

పట్నంలో పెరిగిన ఓటర్లు

- ఐదేళ్లలో 69,812 కొత్త ఓటర్ల నమోదు
- అనుబంధ(తుది) జాబితాను విడుదల చేసిన ఈసీ
- కీలకం కానున్న మహిళా ఓటర్లు

ఇబ్రహీంపట్నం: 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. అధికారులు అక్టోబర్ 4వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే జాబితాలో పేర్లు లేని, కొత్త ఓటర్లను చేర్చేందుకు ఎన్నికల కమిషన్ అక్టోబర్ 31 వరకు అవకాశం కల్పించింది. తదనంతరం ఓటర్ నమోదుపై విస్తృత ప్రచారం చేయడంతో చాలామంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. ఓటర్ల తుది జాబితాకు అనుబంధంగా నవంబర్ 11న ఎన్నికల సంఘం కొత్త జాబితాను విడుదల చేసింది.



16,897 కొత్త ఓటర్ల నమోదు..

అక్టోబర్ 4 నుంచి అక్టోబర్ 31 వరకు (26రోజుల్లో) నియోజకవర్గంలో 16,897 మంది కొత్త ఓటర్లు నమోదు కావడం విశేషం. ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. తాజా జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 3,27,583 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,65,760, మహిళలు 1,61,786, థర్డ్ జెండర్స్ 37 మంది ఉన్నారు. గడచిన నాలుగైదు నెలల్లోనే 69,812 మంది ఓటర్లు పెరిగారు.

పదేళ్లలో పెరిగిన ఓటర్లు 97,195..

అసెంబ్లీ సెగ్మెంట్‌లో గడచిన పదేళ్లలోపు 97,195 మంది ఓటర్లు పెరిగారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 2,30,388 ఓటర్లుంటే, 2018 నాటికి ఆ సంఖ్య 2,57,771కి పెరిగింది. తాజాగా 2023 నవంబర్‌లో విడుదల చేసిన జాబితా ప్రకారం ఆ సంఖ్య 3,27,583కిపెరిగింది. ఈ లెక్కన 2018 నాటికి కొత్త ఓటర్లు 27,383 పెరిగితే, 2023ఎన్నికల నాటికి దానికి రెండింతలు అంటే 69,812 మంది కొత్త ఓటర్లు పెరిగారు. మొత్తంగా గడిచిన పదేళ్లలో నియోజకవర్గంలో 97,195 మంది నూతన ఓటర్లు నమోదయ్యారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి



ప్రచారం రథంపై మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ప్రజావ్యతిరేకత ఉందని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలోని కుత్బుల్లాపూర్, గౌరెల్లి, బాచారం, బండరావిరాల, కవాడిపల్లి, బలిజగూడ గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో తప్ప గత పదేళ్లలో మండలం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేఖ, జెడ్పీటీసీ దేవదాసుగౌడ్, నాయకులు జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి యాదిరెడ్డి, సీఐటీయూ నాయకులు హరిసింగ్ నాయక్ పాల్గొన్నారు.

మల్‌రెడ్డికి టీడీపీ మద్దతు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంగళవారం టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం స్థానికంగా మున్సిపల్ అధ్యక్షుడు రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డికి మద్దతునిచ్చి.. ఆయన విజయమే లక్ష్యంగా ప్రచారంలో పాల్గొనాలని తీర్మానించారు. అనంతరం రంగారెడ్డి సోదరుడు రాంరెడ్డిని కలిసి మద్దతునిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జలమోని రవీందర్, నాయకులు కృష్ణ, మహేందర్, కృష్ణవేణి, వీరాచారి, ప్రభాకర్, అంజయ్య, వెంకటేశ్‌గౌడ్, దాసుగౌడ్, శివకృష్ణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- బీఆర్‌ఎస్ కల్వకుర్తి అభ్యర్థి జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమని ఆ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి జైపాల్‌యాదవ్ అన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు మండలం మంగళపల్లిలో మంగళవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. ప్రజలు మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు శంకర్, మురళి, వెంకటేశ్, తానయ్య పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో జైపాల్‌యాదవ్

జైపాల్‌యాదవ్‌ను గెలిపించుకుందాం

మాడ్గుల: అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సింగిల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్కపల్లిలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తులకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలపాలన్నారు. నాయకులు శంకర్‌గౌడ్, వార్డు సభ్యులు శివలింగం, జహంగీర్, చంద్రయ్య, నాయకులు.. నరేష్, శేఖర్, జమీల్, జంగయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డిని అసెంబ్లీకి పంపుదాం

- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్
- కొనసాగుతున్న ఇంటింటి ప్రచారం

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా మంగళవారం కడ్తాల్, మైసిగండిలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ అసమర్థ పాలనతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కసిరెడ్డి నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు హీరాసింగ్, వినోద్‌నాయక్, జహంగీర్‌బాబా, భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, వేణుగోపాల్, యాదగిరిరెడ్డి, శేఖర్‌గౌడ్, అమర్‌సింగ్ తదితరులు ఉన్నారు.



కడ్తాల్: ఇంటింటి ప్రచారంలో శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం..

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎంపీటీసీ యాదయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు గత ఎన్నికల హామీల అమలులో విఫలమయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని అన్నారు. కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కసిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు.. రంగారెడ్డి, యాదయ్య, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, నర్సింహ పాల్గొన్నారు.

బెల్టుషాపులపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ సీఐ బద్యానాథ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

కడ్తాల్: ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ప్రత్యేకించి మండల పరిధిలోని మైసిగండి ఆలయ పరిసరాల్లో ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో ఫంక్షన్‌హాల్స్, ఫాంహౌస్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో, ఫంక్షన్‌హాల్స్‌లో, ఫాంహౌస్‌లలో ఎవరైనా ఫంక్షన్స్ ఏర్పాటు చేస్తే ఈవెంట్‌కు సంబంధించిన పర్మిషన్ ఎక్సైజ్ శాఖ అధికారుల నుంచి తప్పకుండా తీసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన పోస్టర్స్‌ను ఈ సందర్భంగా ఆయా ఫంక్షన్‌హాల్స్, ఫాంహౌస్‌ల గోడలకు అంటించారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఈవెంట్స్ ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మైసిగండి సమీపంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి 37 మద్యం బాటిళ్లతో కూడిన బ్యాగ్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. అనంతరం శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై, టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

- మాస్టర్ సోను



కరాటే శిక్షణలో విద్యార్థినులు

కడ్తాల్: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని.. బాలికలు కరాటేపై ప్రత్యేక దృష్టి సారించాలని మాస్టర్ సోను అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను పాఠశాల హెచ్‌ఎం అరుణతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కరాటేకు సంబంధించిన పలు విషయాలపై మాస్టర్ సోను విద్యార్థులకు వివరించారు. అమ్మాయిలపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలి, విపత్కర పరిస్థితుల నుంచి ఎలా బయటపడాలో అనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. బాలికలు తప్పనిసరిగా కరాటే శిక్షణ పొందాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు జయంతి తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం



విద్యార్థినులకు బహుమతులు అందజేసిన జడ్జి సల్మా ఫాతిమా, ఉపాధ్యాయులు

తుర్కయంజాల్: బాల్యవివాహాలను అరికట్టాలని 14వ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ సల్మా ఫాతిమా పిలుపునిచ్చారు. రాగన్నగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చిల్డ్రన్స్‌డే వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులగురించి వివరించారు. అదేవిధంగా రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని సూచించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులను అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, శంకర్, శ్రీదేవి, రవి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

హయత్‌నగర్: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని.. భవిష్యత్తులో ఎలాంటి తప్పులు చేయకుండా ఇది దోహదం చేస్తుందని హయత్‌నగర్‌లోని 14వ మెట్రో పాలిటన్ కోర్టు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేస్తాం

- బీజేపీ కల్వకుర్తి అభ్యర్థి ఆచారి

తలకొండపల్లి: కల్వకుర్తిలో కాషాయ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. కమలం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాసాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం రథంపై మాట్లాడుతున్న ఆచారి

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కడ్తాల్: మండల కేంద్రంలోని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్‌లో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ఫౌండర్ శేషగిరిరావు మాట్లాడుతూ.. విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని.. ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఫౌండర్ రమేష్, ప్రిన్సిపాల్ సంజీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గులాబీ జోష్

- కేసీఆర్ సభతో పట్నం నేతల్లో నూతనోత్తేజం
- ఆకట్టుకున్న కళాకారుల ఆటపాటలు
- జై కేసీఆర్, జై కిషన్‌రెడ్డి అంటూ నినాదాలు

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ.. ఆ పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సభాప్రాంగణమంతా గులాబీమయంగా మారింది. జై కేసీఆర్, జై కిషన్‌రెడ్డి అనే నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.

సీఎం రాకతో హోరెత్తిన సభాస్థలి...

సాయంత్రం 4.25 నిమిషాలకు సీఎం కేసీఆర్ స్టేజిపైకి చేరుకోగానే ఒక్కసారిగా సభా ప్రాంగణమంతా జై కేసీఆర్, జై తెలంగాణ అనే నినాదాలతో హోరెత్తింది. అనుకున్న దానికంటే ప్రజలు అధికంగా రావడంతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహన్ని నింపింది. బైక్‌లపై ర్యాలీగా యువత తరలిరాగా డీసీఎంలు, ఆటోల్లో అభిమానులు తరలివచ్చారు. సీఎం ప్రసంగంతో నేతల్లో ఉత్సాహం నెలకొంది.

ఆకట్టుకున్న ధూంధాం..

గులాబీల జెండాలమ్మ రామక్క..... గుర్తుల గుర్తుంచుకో రామక్క....కారును గుర్తుంచుకో రామక్క అంటూ మధుప్రియ పాడిన పాట సభకు వచ్చిన ప్రజలను ఉర్రూతలూగించింది. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డితోపాటు అభిమానులంతా ఈ పాటకు స్టెప్పులేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కళాకారులు ఆటపాటల ద్వారా వివరించారు.

భారీ బందోబస్తు..

నామినేషన్ల సమయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గీయులు ఒకరిపై ఒకరు రాళ్లదాడి చేసుకున్న సంఘటనను దృష్టిలో పెట్టుకొని సీఎం సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చౌరస్తాల్లో, సభా ప్రాంగణం, వేదిక వద్ద ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. రాచకొండ పోలీసు ఉన్నతాధికారులతో పాటు సుమారు 800 మంది సిబ్బంది సీఎం సభ బందోబస్తులో పాల్గొనట్లు అధికారులు తెలిపారు.

సమయభావంతో మాట్లాడని మంత్రి...

సమయాభావంతో మంత్రి సబితారెడ్డి సభలో ప్రసంగించలేదు. సీఎం ప్రసంగం సమయానికే చీకటి పడుతుండటంతో త్వరగా సభను ముగించాల్సి ఉండటంతో మంత్రి సబితారెడ్డికి మాట్లాడే అవకాశం దక్కలేదు. మొత్తానికి సీఎం సభతో పట్నం నేతల్లో కొత్త జోష్ కనిపించింది.

వాడు మనోడా... మందోడా

ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ కొంత అసహనానికి గురయ్యారు. ఆయన ప్రసంగిస్తుండగా రోడ్డుపై నుంచి సౌండ్ బాక్స్ సిస్టమ్‌లో కంటిన్యూగా మ్యూజిక్ వినిపించింది. ఆ మ్యూజిక్ సప్పుడేంది.. వాడు మనోడా...మందోడా అంటూ ప్రశ్నించారు. డబ్బా కొట్టుకునేది ఉంటే ఊర్లో కొట్టుకోమనూ.. వాడు మొత్తుకోబట్టే... నేను మొత్తుకుంటుంటి.. ఎట్లా మనసుపెట్టాలి అంటూ అసహనానికి గురయ్యారు. వాళ్లు మనోళ్లే అని అక్కడున్న వారు చెప్పడంతో మ్యూజిక్ బంద్ పెట్టమని గట్టిగా చెప్పారు. నినాదాలతో ఆగం కావద్దు ఓటు జాగ్రత్తగా ఓటువేయాలని ప్రజలను కోరారు. అయితే ప్రసంగం మధ్యలో హెలికాప్టర్ సిబ్బంది సూచనలు చేయడంతో హెలికాప్టర్‌తో ఇదే పంచాయితీ.. జర అలస్యమైతే ఎగరదు.. నేను పోవాలి అంటూ తన ప్రసంగాన్ని త్వరగా ముగించి సభాస్థలి నుంచి వెళ్లిపోయారు.



సభావేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ప్రశాంత్‌రెడ్డిని ఎత్తుకున్న యువకులు



సభా ప్రాంగణం వద్ద భారీ ఫ్లెక్సీ

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు

కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ పార్టీ విధ్వంసం సృష్టిస్తోందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడగొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీలో డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. మధుయాష్కీ మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్‌లో....

కొత్తపేట డివిజన్‌లో రాజీవ్‌గాంధీనగర్ మసీదు నుంచి శ్రీనివాస కాలనీ, ఆర్టీసీ కాలనీ మీదుగా శివాలయం వరకు మధుయాష్కీ గౌడ్ పాదయాత్రతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐసీసీ అధికార ప్రతినిధి షమా మహమ్మద్, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.